# నవతరం

RNI NO. APTEL/2014/58326

తెలుగు దినపత్రిక

సంపుటి : -13 సంచిక : 167 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

05-05-2026 మంగళవారం వెల : 1 /- పేజీలు : 4




- మూడున్నర దశాబ్దాల నిష్కళంక సేవతో ప్రత్యేక గుర్తింపు
- కఠిన విధి నిర్వహణలో రాజీ లేని ధోరణి
- మానవతతో మెలిగే హృదయం... అందరికీ చేరువైన అధికారి
- అనుభవం చెప్పే ప్రతి మాట... మార్గం చూపే దిక్సూచి
- "అన్న... బ్రదర్..." అంటూ ఆప్యాయత పంచే వ్యక్తిత్వం
- పేదల పట్ల మమకారం... అవసరంలో అండగా నిలిచే స్వభావం
- అంచెలంచెలుగా ఎదిగి గౌరవాన్ని సంపాదించిన సేవా ప్రయాణం
- యూనిఫామ్‌కు విలువ తీసుకొచ్చిన నిజాయితీ గల అధికారి
- పుట్టిన రోజు సందర్భంగా నవతరం ప్రత్యేక కథనం

# సేవే శిఖరం... ఆ శిఖరంపై సుధాకర్



**కొంతమంది ఉద్యోగం చేస్తారు...**
**మరికొందరు విధిని నిర్వర్తిస్తారు...కానీ చాలా అరుదుగా కొంతమంది తమ జీవితాన్నే సేవగా మలుచుకుంటారు.ఆ అరుదైన వ్యక్తిత్వాల్లో ఒకరు మెట్ట సుధాకర్.**
**సంవత్సరాలు గడిచినా... బాధ్యతలు పెరిగినా...**
**ఆయన అడుగులో వేగం తగ్గలేదు ఆయన ముఖంలోని చిరునవ్వు మసకబారలేదు.వయసు సంఖ్యగా మారిపోయినా ఆయనలోని ఉత్సాహం మాత్రం ఇప్పటికీ అలాగే ఉంది.యూనిఫామ్‌లో కనిపించే కఠినత్వం వెనుక ప్రజల కోసం కొట్టుకునే హృదయం ఉంది.ఎవరైనా సమస్యతో ముందుకు వస్తే---ముందు వినేది ఆయన ఓపిక...తర్వాత స్పందించేది ఆయన మనసు...**
**చివరికి దారి చూపేది ఆయన అనుభవం.అందుకే ఆయన దగ్గరకు వచ్చే వారు సహాయం కోసం మాత్రమే రారు...ఒక నమ్మకంతో వస్తారు...**
**మళ్లీ మళ్లీ రావాలనిపించే ఆత్మీయతతో వస్తారు.**

**(నవతరం ప్రతినిధి, శ్రీకాకుళం)**

1987లో పోలీస్ శాఖలో అడుగుపెట్టిన మెట్ట సుధాకర్, మూడున్నర దశాబ్దాలుగా నిరంతర సేవలందిస్తూ తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును నిర్మించుకున్నారు. ఎచ్చర్ల మండలంలో సాధారణ కుటుంబంలో జన్మించిన ఆయన,అక్కడి నేల నుంచి ప్రారంభమైన ఆయన ప్రయాణం నేడు శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా ఒక గౌరవ స్థాయికి చేరుకుంది.పోలీస్ శాఖలో క్రింది స్థాయి నుంచి ప్రారంభమైన ఆయన సేవ,అంచెలంచెలుగా ఎదుగుతూ నేటి ట్రాఫిక్ ఎస్ఐ స్థాయికి చేరింది.ఇది కేవలం ఉద్యోగ ప్రగతి కాదు నిబద్ధత, కష్టపడే తత్వం, నిజాయితీకి లభించిన గౌరవం.2028లో రిటైర్మెంట్‌కు చేరువలో ఉన్నప్పటికీ–ఆయనలోని ఉత్సాహం, విధి పట్ల ఉన్న కట్టుబాటు మాత్రం ఏమాత్రం తగ్గలేదు.

## విధి పట్ల నిబద్ధత... సేవలో నిష్ఠ

పోలీస్ ఉద్యోగం అంటే కేవలం పని కాదు,సమాజానికి ఇచ్చే ఒక నమ్మకం.ఆ నమ్మకాన్ని ఆయన ప్రతీ రోజూ తన పనితో నిలబెట్టారు.ట్రాఫిక్ నియంత్రణలో క్రమశిక్షణ, నిబంధనల అమలులో కట్టుదిట్టత ఆయన పనితీరులో స్పష్టంగా కనిపిస్తాయి.

## మనసు గెలుచుకున్న మానవత్వం

"తమ్ముడు... అన్న... బ్రదర్..." అంటూ పలకరించే ఆయన మాటల్లో ఒక నిజమైన ఆప్యాయత ఉంటుంది.పేదల పరిస్థితిని అర్థం చేసుకుని సహాయం చేయడం,అపదలో ఉన్నవారికి అండగా నిలవడం ఆయన సహజ స్వభావం అందుకే ఆయన పేరు వినగానే గౌరవంతో పాటు ఒక దగ్గరితనం కూడా కలుగుతుంది.

## అనుభవం... మార్గం చూపే దిక్సూచి

మూడున్నర దశాబ్దాల అనుభవం ఆయనకు ఒక బలం.
ఎవరైనా సందిగ్ధంలో ఉన్నప్పుడు ఆయన ఇచ్చే సలహా వారి జీవితానికి మార్గదర్శకంగా మారుతుంది.అందుకే చాలామందికి ఆయన ఒక అధికారి మాత్రమే కాదు... ఒక సలహాదారు.

# జలవనరుల పునరుద్ధరణకు పకడ్బందీ చర్యలు

- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- జిల్లాలో 1196 'జలధార' పనులు ప్రారంభం



**(నవతరం, శ్రీకాకుళం)**

జిల్లాలో భూగర్భ జల మట్టాన్ని పెంచడంతో పాటు, ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టే లక్ష్యంతో 'జలధార – జలహారతి' పనులను యుద్ధప్రతిపాదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లా అభివృద్ధిలో జల సంరక్షణ కీలకమని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 7,376 పనులను గుర్తించగా, ఇప్పటికే 3,925 పనులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేశామని, ఇందులో 1,196 పనులు క్షేత్రస్థాయిలో విజయవంతంగా ప్రారంభమయ్యాయని ఆయన వెల్లడించారు.

ముఖ్యంగా చెరువుల పూడికతీత, ఫీడర్ ఛానల్స్ పునరుద్ధరణ, చెరువు గట్ల పటిష్టత వంటి పనుల ద్వారా సాగునీటి వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే పూర్తి చేసి రైతులకు ప్రయోజనం చేకూర్చాలని సూచించారు. మండలాల వారీగా ప్రగతిని పరిశీలిస్తే..మెలియాపుట్టి మండలం 80 శాతం పనులను ప్రారంభించి ఆదర్శంగా నిలిచిందని, ఇచ్ఛాపురం, వజ్రపుకొత్తూరు మండలాలు కూడా మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాయని ఆయన అభినందించారు.

తక్కువ పురోగతి ఉన్న మండలాల్లో పనుల వేగాన్ని పెంచేందుకు ఎంపీడీఓలు, ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. గ్రామాల్లో జలవనరుల ప్రాముఖ్యతపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు 'జలహారతి' కార్యక్రమాలను భాగస్వామ్యం చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సాంకేతిక ఇబ్బందులు ఉంటే వెంటనే పరిష్కరించి, నిర్దేశించిన గడువులోగా వంద శాతం పనులు గ్రౌండింగ్ అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ హరి ఓం పాండియా, ఇరిగేషన్ ఎస్ఈ పొన్నాడ సుధాకర్, డ్వామా పీడీ లవరాజు, జెడ్పీ సీఈఓ వెంకటరమణ ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎడిటోరియల్

# ఉక్రోషదాడుల ఉత్తరువు!

అమెరికా,ఇజ్రాయిల్ ప్రారంభించిన ఏకపక్ష దాడులు, దానికి ఇరాన్ ప్రతిఘటనకు రెండు నెలలు గడచిపోయాయి. ఏప్రిల్ ఏడు నుంచి తాత్కాలిక కాల్పుల విరమణ అమల్లోకి వచ్చింది.తొలుత హోర్ముజ్ జలసంధిని ఇరాన్ ఒక్కటే దిగ్బంధిస్తే తరువాత అమెరికా మరోవైపునుంచి నౌకలను మలేస్తున్నది.ఈ పరిస్థితిలో ఎప్పుడు మార్పు వస్తుందో తెలియదు. అమెరికా రాజ్యాంగం ప్రకారం అరవై రోజులకు మించి అధ్యక్షుడి ఉత్తరువులతో ఏదేశం మీద కూడా సైనిక చర్య జరిపేందుకు వీల్లేదు. దీంతో చట్టంలో ఉన్న అవకాశాన్ని వినియోగించుకొని మరో నెల రోజుల పాటు ఇరాన్ మీద దాడులను పొడిగిస్తూ ఏప్రిల్30న ట్రంప్ ఉత్తరువులు జారీ చేశాడు.కాల్పుల విరమణ వ్యవధిలో మరిన్ని బలగాలను సమీకరించేందుకు వినియోగించుకుంటున్నట్లు ఇరాన్ చెబుతున్న సంగతి తెలిసిందే. ఇరాన్ మీద మరోసారి దాడులకు తెగబడితే తీవ్రమైన హానికర పర్యవసానాలు ఉంటాయని, ఇది ఏమాత్రం సమర్ధనీయం కాదని రష్యా అధ్యక్షుడు పుతిన్ అమెరికాను హెచ్చరిం చాడు. ట్రంప్‌తో గంటన్నర పాటు ఫోన్‌లో మాట్లాడిన అనేక అంశాల్లో ఇదో హెచ్చరిక. భూతల దాడులకు దిగాలని చేస్తున్న ప్రయత్నాల గురించి తమనేత ట్రంప్‌ను హెచ్చరించినట్లు పుతిన్ విదేశాంగవిధాన సలహాదారు చెప్పాడు. పుతిన్‌తో సంభాషణ తరువాత తాము మంచిగా మాట్లాడుకున్నామని, తనకు పుతిన్ ఎప్పటి నుంచో తెలుసని ట్రంప్ చెప్పుకున్నాడు. ఇరాన్ యురేనియంను అవసరమైతే తమ ఆధీనంలో ఉంచుకుంటామని పుతిన్ చెప్పగా ఉక్రెయిన్‌లో పోరును ముగించాలని కోరుకుంటున్నట్లు ట్రంప్ చెప్పాడట. మరింతగా ఊబిలోకి దిగవద్దంటూ జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ చేసిన స్నేహపూర్వక హెచ్చరిక మీద మండిపడిన ట్రంప్ మరోసారి తన అసహనం, దురుసుతనాన్ని ప్రదర్శించాడు. బీటలు వారిన మీదేశం సంగతి ముందు చూసుకోండి,ఇరాన్ అణుముప్పును తొలగించేందుకు చూస్తున్నవారి వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దంటూ వ్యాఖ్యానించాడు. అంతేకాదు ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధాన్ని నివారించటంలో జర్మనీ పూర్తి అసమర్ధంగా వ్యవహరించిందంటూ ఎదురుదాడి చేశాడు.తమకు మద్దతుగా దాడుల్లో పాల్గొనాలన్న ట్రంప్ వినతిని తమ యుద్ధం కాదంటూ నాటో దేశాలు తిరస్కరించిన సంగతి తెలిసిందే. పిర్రగిల్లి జోలపాడినట్లుగా ఇరాన్ దౌత్యపరంగా ఎంతో తెలివిగా వ్యవహ రించిందని, అమెరి కాను అవమానిం చిందని జర్మన్ ఛాన్సలర్ మెర్జ్ వాషింగ్టన్ గాలి తీశాడు.అఫ్ కోర్స్ ట్రంప్ వదరుబోతు తనంతో పోల్చితే ఇది చాలా తక్కువే. మామ తిట్టినందుకు కాదు తోడల్లుడు నవ్వినందుకు అన్నట్లుగా ఇరాన్ చేతిలో పొందుతున్న పరాభవానికి సిగ్గుపడాల్సిన ట్రంప్ స్నేహపూర్వక సలహా మీద మండిపడటం అనుచితం.పశ్చిమాసియాలో అమెరికా సృష్టించిన సంక్షోభం ప్రారంభమై రెండు నెలలు దాటింది. ఇరాన్ మీద తాము సైనిక చర్యను ప్రారంభించామే తప్ప దాన్ని యుద్ధంగా తాను పిలవటం లేదని ఏప్రిల్ ఒకటవ తేదీన చేసిన ప్రసంగంలో ట్రంప్ యావత్ అమెరికాను వెర్రి వెంగళప్పలను చేశాడు. ఎందుకంటే అమెరికా రాజ్యాంగం ప్రకారం మరొక దేశం మీద యుద్ధం చేయాలంటే అక్కడి పార్లమెంటు ఆమోదం అవసరం.దానితో నిమిత్తం లేకుండానే ట్రంప్ గతేడాది, ఇప్పుడు కూడా దాడులకు ఆదేశించాడు.రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని ఎంత పరిహాస ప్రాయంగా మార్చారో ఇంతకంటే నిదర్శనం అవసరం లేదు.అధ్యక్షుడి మిలిటరీ చర్య ఉత్తరువుల వ్యవధి అరవై రోజుల్లో ముగుస్తుంది. తరువాత దాడులను నిలిపివేయాల్సి ఉంటుంది. అయితే మరో నెల రోజుల పాటు పొడిగించేందుకు రాజ్యాంగంలో వీలు వుండటంతో ఆ మేరకు మరో 30రోజులు దాడులను పొడిగించేందుకు ఏప్రిల్ 30న ఉత్తరువుల మీద సంతకం చేస్తూ మరోసారి అదే చెప్పాడు.దీన్ని బట్టి ఇరాన్ మీద మరోసారి తెగబడేందుకు అవకాశం ఉంది. ఈ నేపధ్యంలోనే పుతిన్ గట్టి హెచ్చరిక చేసినట్లు భావించాల్సి వస్తోంది.

ఇరాన్‌పై వాషింగ్టన్ చెలగాటం మనతో సహా అనేక దేశాలకు ప్రాణ సంకటంగా మారింది. మే ఒకటవ తేదీ నుంచి వాణిజ్య గ్యాస్ సిలిండర్ల ధరను చమురు సంస్థలు రూ.2,078 నుంచి రూ.3071కి పెంచాయి. ముందుగా ఊహించినట్లుగా ఇది ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన తరువాత ఈ బండను మోపారు. దేశ చరిత్రలో ఇదొక రికార్డు, దీన్ని నరేంద్రమోడీకే అంకితం ఇవ్వాలి.పెంచింది వాణిజ్య సిలిండర్ ధరేగా అని ఎవరైనా అతితెలివి ప్రదర్శించవచ్చు. గృహం, వాణిజ్య సిలిండర్ పేరు ఏదైతేనేం, భారాన్ని భరించేది జనమే.

ధరల పెంపుదల లేదు అంటూ రోజూ ఊదరగొడుతున్నవారు ఇప్పటికే పవర్ పెట్రోలు, పారిశ్రామిక అవసరాల డీజిల్,గృహ, వాణిజ్య వినియోగగ్యాస్ ధరలను పెంచారు.నష్టాలు వస్తున్న మార్కెటింగ్ కంపెనీలను ఆదుకొనేందుకు పన్నెండు సంవత్సరాలుగా జనం జేబులను కొల్లగొడుతున్నది. అదనపు ఎక్సయిజ్ డ్యూటీని కేంద్రం తగ్గించుకుంది, దీంతో వినియోగదారులకు ఒరిగేదేమీ లేదు.ఈ మొత్తంలో రాష్ట్రాలకు వాటా లేదు గనుక మౌనంగా ఉన్నాయి.ఇప్పటికీ సెస్‌ల రూపంలో రాష్ట్రాలకు వాటా ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం లీటరు పెట్రోలుకు రూ.7.50, డీజిలు మీద రూ.6, అదనంగా కస్టమ్స్,మొత్తం డ్యూటీల మీద పదిశాతం చొప్పున సంక్షేమ సర్‌ఛార్జీ వసూలు చేసుకుంటున్నది. జన సంక్షేమానికి జనం నుంచే వసూలు చేస్తూ తామేదో ఒరగబెడుతున్నట్లు ఫోజు అదనం !

# సిక్కోలులో "ఆశా భోస్లే" కు సంగీత నివాళి

## - తెలుగు చిత్ర పరిశ్రమలో తనదైన ముద్రవేశారన్న వక్తలు




(శ్రీకాకుళం త్రిలోక గూఢచారి)

తెలుగు చిత్ర పరిశ్రమలో ఆశా భోస్లే తనదైన ముద్రవేశారని, నగరంలో పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక బాపూజీ కళామందిర్ లో, జేసీఐ శ్రీకాకుళం మెయిన్, కెరీర్ ఫైర్, సిక్కోలు సింగర్స్ నేతృత్వంలో ఆశా భోస్లే పేరిట చిన్నారులకు పాటల పోటీలను నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజల్వన చేసిన అనంతరం, ఆమె చిత్రపటానికి పుష్పాలతో అంజలిఘటించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగముగా లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మెంటార్ నటుకుల.మోహన్, జేసీఐ శ్రీకాకుళం వ్యవస్థాపకులు డా.జామి.బీమశంకర్ తదితరులు ఆమె జీవిత విజయాల పరంపరను, విసేసాలను అందరితో పంచుకున్నారు.

ఈ సందర్భంగా వారు, పలువురు వక్తలతో కలసి మాట్లాడుతూ ప్రముఖ గాయని ఆశా భోస్లే, తనదైన శైలిలో గానం చేసి తెలుగు చిత్ర పరిశ్రమలో తనదైన ముద్ర వేశారని, ఆమె పాడిన పాటలను, తెలుగు సంగీత ప్రియులు ఇప్పటికీ ఆదరిస్తూనే ఉన్నారన్నారు. భారతీయ చలనచిత్ర సంగీత చరిత్రలో ఒక సువర్ణాధ్యాయం ముగిసిందని, తన గాన మాధుర్యంతో దాదాపు ఎనిమిది దశాబ్దాల పాటు యావత్ దేశాన్ని ఉర్రూతలూగించిన 'క్వీన్ ఆఫ్ ఇండీ పాప్', లెజెండరీ గాయని ఆశా భోస్లే అని గుర్తుచేశారు. వేలాది హిందీ పాటలతో పాటు.. తెలుగులోనూ ఆమె ఎన్నో అద్భుతమైన పాటలు పాడారని, 'పాలు నీళ్లు' సినిమాతో మొదలైన ఆమె తెలుగు పాటల ప్రవాహం కృష్ణవంశీ 'చందమామ' వరకు ఎన్నో మరపురాని ఆణిముత్యాలను మనకు అందించారన్నారు. అనంతరం జెసిఐ శ్రీకాకుళం మెయిన్ అధ్యక్షురాలు తమ్మినేని ఉషారాణి, అడ్వైజర్ మణిశర్మ, డైరెక్టర్ సనపల తేజస్వి, స్వాతి, ఉపాధ్యక్షులు సురేంద్రనాధ్, కెరీర్ ఫైర్ సాయి బాబా, సిక్కోలు సింగర్స్, మీడియా ప్రతినిధులు డా.డోలా.అప్పన్న, పేడాడ.హేమసుందర్ చేతుల మీదుగా పాల్గొన్న చిన్నారులకు ప్రశంసా పత్రం, జ్ఞాపికలను అందించారు.

ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధి శ్రీ రంగం మధు గురుస్వామి, సత్య సాయి పాఠశాల అధినేత మధుసూదన్ పట్నాయక్, జూనియర్ జేసీ ఛైర్పర్సన్ స్నేహాంజలి సనపల, సెక్రటరీ తమ్మినేని.తనూష, కోశాధికారి బరాటం చాందిని, ఇతర జెసి సభ్యుల బృందం, సిక్కోలు సింగర్స్ ప్రతినిధులు, డా.పైడి. ప్రదీప్, సంగీత ప్రియులు, చిన్నారులు, స్థానిక ప్రజలు, వక్తలు, ప్రముఖులు పాల్గొన్నారు.

# రైతు భూముల రక్షణకు కాంగ్రెస్ వినతి

- కొర్లాం గ్రామంలో భూములపై వివాదం
- రైతులపై బలవంతపు స్వాధీనం ఆరోపణలు
- కలెక్టర్ గ్రీవెన్స్‌లో వినతిపత్రం సమర్పణ
- డీసీసీ అధ్యక్షుడు అన్నాజీ రావు ఆధ్వర్యంలో చర్య



**నవతరం -సోంపేట**

మండలంలోని కొర్లాం గ్రామంలో రైతులు సాగు చేస్తున్న భూములను బలవంతంగా స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ నాయకులు, రైతులు కలసి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఒరిస్సా రాష్ట్రం గంజాం జిల్లా జయంతిపురానికి చెందిన జమీందారీ కుటుంబానికి చెందిన కృష్ణానంద పాడి ఈ భూములు తమవని దాబి చేస్తూ, ఎన్నో సంవత్సరాలుగా సాగు చేస్తున్న స్థానిక రైతులను బెదిరించి భూములు స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో డీసీసీ అధ్యక్షుడు సనపల అన్నాజీ రావు ఆధ్వర్యంలో సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు రెల్ల సురేష్, నాయకులు కె.వి.ఎల్.ఎస్ ఈశ్వరి, ఇజ్జురోతు రమణ, కరిమజ్జి మల్లేశ్వరరావు, ఆబోతులు వెంకట్ నాయుడు, మామిడి సత్యనారాయణ, కొత్తపల్లి రాంప్రసాద్, గొల్లపల్లి దాలయ్య, గుంటు బారిక అప్పారావు తదితరులు రైతులతో కలిసి కలెక్టర్ గ్రీవెన్స్‌కు వెళ్లి న్యాయం చేయాలని కోరారు.

రైతులు సంవత్సరాలుగా సాగు చేస్తున్న భూములను రక్షించి, వారికి న్యాయం చేయాలని అధికారులను విజ్ఞప్తి చేశారు.

# నేతన్నలకు ఉచిత విద్యుత్తు ఊరట

## మొదలైన 'సున్నా' బిల్లుల పంపిణీ



**నవతరం-శ్రీకాకుళం**

రాష్ట్ర ప్రభుత్వం చేనేత కళాకారులు, పవర్‌లూమ్ యూనిట్లకు ఇచ్చిన ఉచిత విద్యుత్ హామీని అమలు చేస్తూ శ్రీకాకుళం జిల్లాలో తొలి నెలలోనే లబ్ధిదారులకు 'సున్నా' విద్యుత్ బిల్లులను అందజేసింది. ఏప్రిల్ 1, 2026 నుంచి అమల్లోకి వచ్చిన ఈ పథకం కింద అర్హులైన చేనేత కుటుంబాలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ యూనిట్లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును వర్తింపజేస్తూ ప్రభుత్వం ఇదివరకే ఉత్తర్వులు జారీ చేసిన సంగతి విదితమే. ఈ క్రమంలో జిల్లా చేనేత, జౌళి శాఖ, విద్యుత్ శాఖల సమన్వయంతో శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా 1,242 చేనేత కుటుంబాలను, ఒక పవర్‌లూమ్ యూనిట్‌ను అధికారికంగా గుర్తించి, వారికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూర్చినట్లు జిల్లా చేనేత, జౌళి శాఖాధికారి టి. జనార్ధనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా చేనేత కుటుంబాలకు నెలకు సుమారు రూ. 720 (ఏడాదికి రూ. 8,640), పవర్‌లూమ్ యూనిట్లకు నెలకు రూ. 1,800 (ఏడాదికి రూ. 21,600) చొప్పున ఆర్థిక వెసులుబాటు కలగనుంది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉచిత విద్యుత్ పథకం పక్కాగా అమలు కావడంపై జిల్లాలోని చేనేత వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. తమ జీవనోపాధిని గుర్తించి అండగా నిలిచిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఈ సందర్భంగా నేతన్నలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారని జనార్ధనరావు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# వైవాహిక దినోత్సవంతో ప్రజల దాహార్తిని తీర్చటం నా అదృష్టం

## జేసీఐ సెనేటర్ నటుకుల.మోహన్




**నవతరం-శ్రీకాకుళం**

వైవాహిక దినోత్సవంతో రోజున ప్రజల దాహార్తిని తీర్చటం నా అదృష్టంగా భావిస్తున్నానని, జేసీఐ సెనెటర్ నటుకుల.మోహన్ అన్నారు. స్థానిక అరసవల్లి కూడలిలో జేసీఐ శ్రీకాకుళం మెయిన్ అధ్యక్షురాలు తమ్మినేని.ఉషరాణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న, ఉచిత మజ్జిగ చలివేంద్రం నిర్విరామంగా కొనసాగుతుందని కొనియాడారు. బాటసారులకు మజ్జిగను అందించి మాట్లాడుతూ ఈ ఏడాది వేసవి ఉష్ణోగ్రతలు దారుణంగా ఉన్నాయని, అవసరం అనుకుంటే తప్ప బయటకు రావద్దని, మంచి నీళ్లను తరచుగా తీసుకుంటే వేసవి ఉపశమనంతోపాటు, వడదెబ్బకు దూరంగా ఉండవచ్చున్నారు. జేసీఐ శ్రీకాకుళం వ్యవస్థాపకులు డా.జామి బీమశంకర్, అధ్యక్షురాలు తమ్మినేని ఉషా రాణి మాట్లాడుతూ అందరి సహకారంతోనే నిర్విరామ మజ్జిగ సేవ కొనసాగుతుందని, నేడు సహకారం అందించిన జేసీఐ సెనేటర్ నటుకుల.మోహన్, రేణుక లకు ప్రత్యేక ధన్యవాదాలన్నారు. సుమారుగా ఈ రోజు రెండు వేల మంది ప్రజలు దాహార్తిని తీర్చుకున్నారని, నరులకు సేవ చేస్తే నారాయునికి చేసినట్లేనన్నారు.

ఈ కార్యక్రమంలో జేసీఐ సెనేటర్ నటుకుల. మోహన్, రేణుక కుటుంబ సభ్యులు, జేసీఐ శ్రీకాకుళం మెయిన్ కార్యదర్శి జామి.కృష్ణ కాంత్, ఉపాధ్యక్షులు ఉర్లం. శివతేజ, నిత్య మజ్జిగ సేవకులు గిరి, హారతి తదితరులు పాల్గొన్నారు.

# ఇది నా మొదటి కథ?




రామ్ అనే ఒక యువకుడు ఉండేవాడు. అతనికి కథలు రాయడం అంటే చాలా ఇష్టం. చిన్నప్పటి నుంచే అతను పెద్ద రచయిత కావాలని కలలు కనేవాడు. కానీ ఒక సమస్య ఉంది.

ప్రతి రోజు అతను నోట్బుక్ తీసుకుని కూర్చునేవాడు. మొదటి లైన్ రాయడానికి ప్రయత్నించేవాడు. కానీ కొద్దిసేపటికి ఆగిపోతాడు.

"ఇంకా మంచి ఐడియా వస్తే రాస్తాను..." అని అనుకుంటాడు.

రోజులు గడిచాయి.

నెలలు గడిచాయి.

సంవత్సరాలు కూడా గడిచిపోయాయి.

ఒక రోజు అతని చిన్న చెల్లెలు అడిగింది:

"అన్నా... ఇంకా కథ రాయలేదా?"

ఆ మాట అతని గుండెలో గట్టిగా తాకింది.

ఆ రోజు రామ్ ఒక విషయం అర్థం చేసుకున్నాడు- పర్ఫెక్ట్ కథ కోసం ఎదురు చూస్తూ ఉంటే, ఏ కథా మొదలవదు.

అతను వెంటనే నోట్బుక్ తీసుకుని, వచ్చిన ఆలోచనతోనే మొదలుపెట్టాడు.

ఆ కథ గొప్పది కాదు... కానీ అది అతని మొదటి కథ.

కొన్ని నెలల తరువాత, అతను మరిన్ని కథలు రాశాడు.

కొన్ని సంవత్సరాల తరువాత, అతను ఒక ప్రసిద్ధ రచయిత అయ్యాడు.

"మీ విజయ రహస్యం ఏమిటి?"

అని ఎవరైన అడిగితే..

అతను నవ్వుతూ

"ఇంకా కథ రాయలేదా?"

అనే చిన్న ప్రశ్నే..అంటు బదులిస్తాడు.

నీతి:

పర్ఫెక్ట్ టైమ్ కోసం ఎదురు చూడొద్దు...

మొదలు పెట్టడం ముఖ్యము.

**రాసినోడు: తేరాల రాజేంద్రప్రసాద్ గుప్త -బాబు జగ్జీవన్ రామ్ నగర్ హైదరాబాద్ 37 - చరవాణి: 9297109223**

# ఊపిరి ఉక్కిరి బిక్కిరి

- దగ్గు, ఆయాసం, పిల్లి కూతలతో ఇబ్బంది
- రోజురోజుకు పెరుగుతున్న ఆస్తమా రోగులు
- జాగ్రత్తలతో నియంత్రించవచ్చు
- నేడు వరల్డ్ ఆస్తమా డే

**నవతరం -పలాస**



సృష్టిలోని ప్రతి జీవికి ఊపిరి ఎంతో అవసరం. ఒక్క నిమిషం ఊపిరి సరిగ్గా ఆడక పోతే ఆ మనిషి పడే ఇబ్బంది అంతా ఇంతా కాదు. ముఖ్యంగా ఆస్తమా రోగులు పడే యాతన వారికి నరకంలా ఉంటుంది. ఈ వ్యాధికి చిన్నా పెద్ద తేడా తెలియదు. ఏ వయసు వారినైనా వేధించి ఉక్కిరి బిక్కిరి చేస్తుంది. మనిషి ఆహారం లేకుండా కొన్ని రోజులు జీవించగలడు. నీరు లేకుండా కొన్ని గంటలు జీవించగలడు. అయితే గాలి లేకుండా మాత్రం కొన్ని నిమిషాలు కూడా జీవించలేడు. గాలిలోని ప్రాణవాయువును మన శరీరంలోకి పంపే అవయవమే ఊపిరితిత్తులు. అటువంటి ఊపిరితిత్తులకు ఏదైనా జబ్బు చేసినప్పుడు మనిషి ప్రాణవాయువు కోసం ఇబ్బంది పడతారు. పూర్వం ఆస్తమా మందులు లేవు. ఇప్పుడు మందులు లభ్యమవుతున్నాయి.

ప్రతి సంవత్సరం మే నెలలో మొదటి మంగళవారం ప్రపంచ ఆస్తమా దినోత్సవం గా పరిగణిస్తారు. ఆస్తమా అనేది శ్వాస లోపం, దగ్గు, ఊపిరితిత్తులు, గురకతో కూడిన దీర్ఘకాలిక ఇన్ ఫ్లమేటరి జబ్బు. ఈ లక్షణాలు రాత్రులు, చలికాలంలో మారుతుంటాయి. ఈ వ్యాధిగ్రస్తుల్లో దుమ్ము, ధూళి, పొగ, వాతావరణం మార్పులు, వైరల్ ఇన్ఫెక్షన్ల వంటి ట్రిగ్గర్ల వల్ల ఊపిరితిత్తుల్లోనే గాలి గొట్టాల్లో వాపు కనిపిస్తోంది. దీనివల్ల దగ్గు, పిల్లి కూతలు, ఆయాసం, చాతి బిగించినట్లు పట్టేయడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. రోగ నిర్ధారణకు రోగి చరిత్ర, క్లినికల్ లక్షణాలను బట్టి చూస్తారు. అలాగే ఎలర్జీ కారకాన్ని గుర్తించేందుకు అలర్జీ చర్మపరీక్ష చేయాల్సి ఉంటుంది. సిగరెట్లు, దుర్గంధ వాసనలు, రసాయనిక సెంట్లు, స్ప్రేలు, శీతల పానీయాలు ఆస్తమాకు దారి తీస్తాయి. ఈ వ్యాధి సోకినప్పుడు శ్వాస తీసుకోవడం అతి కష్టం అవుతుంది. మాటలు చెప్పడం పూర్తి చేయలేరు. నడిస్తే ఆయాసం వస్తుంది. కూర్చున్నా.. పడుకున్నా ఆయాసం రావడంతో పాటు చెమటలు పడతాయి. భయం, ఆందోళన, చివరికి పెదవులు, ముఖం నీలంగా మారుతాయి. ఆస్తమా తీవ్రంగా ఉన్నప్పుడు నిబ్బరంగా ఉండాలి. గాబరా పడకూడదు. పక్కనున్న వారు ధైర్యం చెప్పాలి. ఆస్తమా వచ్చిన వెంటనే డాక్టర్ కు సంప్రదించాలి.

అందుబాటులో ఆధునిక మందులు..

చిన్నపిల్లల్లో ( చైల్డ్ ఆస్తమా) యువతలో ( లేట్ ఆస్తమా) గా పరిగణిస్తారు. రోగి లక్షణాల తీవ్రతను బట్టి చెస్ట్ ఎక్రే, పల్మనరీ ఫంక్షన్ టెస్టుల ద్వారా వైద్యులు ఆస్తమా వ్యాధిని నిర్ధారిస్తారు. దానికి తగ్గట్టుగా ఇన్ హెల్లర్, నేబలైజేషన్ పద్ధతుల ద్వారా ఆస్తమా ను నియంత్రిస్తారు. అంతేగాక మరికొన్ని అత్యాధునిక పద్ధతుల ద్వారా మొండి ఆస్తమా జబ్బును నియంత్రించవచ్చు.

తీసుకోవలసిన జాగ్రత్తలు మసాలాలు, శీతల పానీయాలు, చాక్లెట్లు తినకూడదు, దుమ్ము, ధూళి, ఘాటు వాసనలు, సెంట్లు, స్ప్రేల కు దూరంగా ఉండాలి. చల్లని చలిగాలిలో తిరగకూడదు. గోరువెచ్చని నీరు తాగాలి. పడని పదార్థాలు తినకూడదు. ఉదాహరణకు గోంగూర, వంకాయ వంటివి. పిల్లి, కుక్క వంటి పెంపుడు జంతువులకు దూరంగా ఉండాలి. పొగ తాగరాదు, మద్యపానం చేయరాదు.

ఆస్తమాను ప్రాథమిక దశలో గుర్తిస్తే నయం చేసుకోవచ్చు. డాక్టర్ చెప్పిన మందులు మాత్రమే వాడాలి. ఆస్తమా ఉన్నవారు తప్పనిసరిగా వ్యాయామం చేయాలి. దీనివల్ల ఆస్తమా అటాక్స్ తగ్గుతాయి. ఈ కారణంగా రక్త ప్రసరణ పెరిగి, క్యాలరీలు వినియోగం అవ్వడం వల్ల బరువు తగ్గే కొద్దీ ఆస్తమా రిస్క్ తగ్గుతుంది. రక్త ప్రసరణ పెరగడం వల్ల శరీరానికి మంచి ఆక్సిజన్ అంది అవయవాలన్నీ శక్తివంతం అవుతాయి.



**డాక్టర్ ఉలాల కోదండ రామ్**
అసిస్టెంట్ ప్రొఫెసర్ (కేజీహెచ్)


# ఆ హీరోయిన్‌తో బ్రేకప్.. ఈ హీరోయిన్‌తో డేటింగ్

బాలీవుడ్‌లో డేటింగ్స్ ఎంత కామనో, బ్రేకప్స్ కూడా అంతే కామన్. ఇలా బ్రేకప్ చెప్పి, అలా ఫ్రెష్‌గా మరో డేటింగ్ ప్రారంభించిన నటీనటులు చాలామంది కనిపిస్తారు. ఇప్పుడీ లిస్ట్‌లోకి బాలీవుడ్ నటుడు ఆదిత్య రాయ్ కపూర్ కూడా చేరాడు. మొన్నటివరకు అనన్య పాండేతో పీకల్లోతు ప్రేమలో మునిగితేలిన ఈ హీరో, ఇప్పుడు మరో కొత్త హీరోయిన్ వెంట పడుతున్నాడు. బాలీవుడ్ బ్యూటీ తారా సుతారియా, ఆదిత్య రాయ్ ప్రేమించుకుంటున్నారనే పుకారు బాలీవుడ్ అంతటా గుప్పుమంటోంది.

ఆదిత్య రాయ్ కపూర్, అనన్య పాండే విడిపోయారు. ఓ రేంజ్‌లో గొడవపడి మరీ ఇద్దరూ బ్రేకప్ చెప్పుకున్నారు. ఆదిత్య రాయ్‌ను వదిలేసిన తర్వాత తన ఫ్రెండ్స్ అందరికీ బ్రేకప్ పార్టీ ఇచ్చింది అనన్య. అదే టైమ్‌లో అతడితో దిగిన ఫొటోల్ని కాల్చి బూడిద చేసింది.

ఇటు ఆదిత్య రాయ్ కపూర్ కూడా అనన్యను అన్ని సోషల్ మీడియా వేదికల్లో బ్లాక్ చేశాడు. తన మొబైల్‌లో కూడా ఆమె నంబర్‌ను బ్లాక్ చేశాడు. తనకు వందకు పైగా మెసేజీలు వచ్చాయని, ఒక్క మెసేజ్ కూడా చూడకుండా బ్లాక్ కొట్టానంటూ ఆయన స్వయంగా ఓ ఇంటర్వ్యూలో ప్రకటించాడు.

అలా ప్రేమికుల నుంచి శత్రువులుగా మారిన అనన్య-ఆదిత్య.. ఇప్పుడిప్పుడే తమ వ్యక్తిగత జీవితాల్లో కుదురుకుంటున్నారు. తారా సుతారియాకు దగ్గరయ్యాడు ఆదిత్య.



# డబ్బింగ్ సినిమాకు రూ.60 కోట్లు కావాలంట?



రజనీకాంత్ నటిస్తున్న జైలర్-2 మేటర్ ఇది. ఈ సినిమా తెలుగు హక్కుల రూపంలో 60 కోట్ల రూపాయలు ఆశిస్తున్నారు మేకర్స్. తెలుగు డిస్ట్రిబ్యూటర్ల నుంచి వస్తున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ రేటు ఫిక్స్ చేశారు.

తెలుగులో సూపర్ హిట్టయింది జైలర్ సినిమా. తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాకు 70 కోట్ల రూపాయలకు పైగా గ్రాస్ సాధించింది. అందుకే జైలర్-2కు భారీ రేట్లు చెబుతున్నారు మేకర్స్. అయితే జైలర్‌కు ముందు, ఆ తర్వాత రజనీకాంత్‌కు తెలుగులో పెద్ద విజయాల్లేవు.

రజనీకాంత్ నటించిన కూలి సినిమా తెలుగు రైట్స్ 52 కోట్ల రూపాయలు (జీఎస్టీతో కలిపి)కు అమ్ముడుపోయాయి. అటు వేట్టయాన్ సినిమాకు మంచి ఓపెనింగ్ వచ్చాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని జైలర్-2కు 60 కోట్ల రూపాయలు ఫిక్స్ చేశారు. ఇంత మొత్తానికి బిజినెస్ జరుగుతుందా అనే చర్చ మొదలైంది.

జూన్ 12న థియేటర్లలోకి వస్తోంది జైలర్-2. అంతకంటే ముందు తెలుగులో పెద్ది సినిమా రిలీజ్ అవుతోంది. ఆ సినిమా బ్లాక్ బస్టర్ హిట్టయితే, జైలర్-2కు తెలుగు రాష్ట్రాల్లో థియేటర్లు దొరకడం కష్టం అవుతుంది. ఈ లెక్కలన్నీ వేసుకున్న తర్వాత ఈ సీక్వెల్‌కు ఓ రేటు ఫిక్స్ అయ్యే అవకాశం ఉంది.

నెల్సన్ దర్శకత్వంలో తెరకెక్కుతోంది జైలర్-2. విగ్రహాలు స్మగ్లింగ్ చేసే సిండికేట్‌కు ఎదురెళ్లే రిటైర్డ్ పోలీసాఫీసర్ పాత్రలో రజనీకాంత్ ఇందులో కనిపిస్తారు. సీక్వెల్‌లో ఎస్‌జే సూర్య రూపంలో కొత్త విలన్‌ను పరిచయం చేయబోతున్నారు.

# అరసవెల్లి స్వామివారి దర్శనానికి మంత్రి అచ్చెన్నాయుడు



- కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన మంత్రి
- వేదమంత్రాలతో ఘన స్వాగతం
- ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరణ
- స్థానిక ఎమ్మెల్యే, అధికారులు పాల్గొన్నారు

**నవతరం-శ్రీకాకుళం**

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం అరసవెల్లి శ్రీ సూర్యనారాయణ స్వామివారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేదపండితులు సాంప్రదాయబద్ధంగా వేదమంత్రాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. వేదపండితులు ఆశీర్వదించి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్, ఓఎస్డీ రామచంద్రన్, ఆలయ సూపరింటెండెంట్ అట్టాడ శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# టెక్కలి రెవిన్యూ డివిజన్ ఆఫీసులో జనతా వారధి వినతి పత్రం సమర్పణ



**నవతరం టెక్కలి**

నేడు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న జనతా వారది కార్యక్రమములో భాగముగా టెక్కలి మండల బిజెపి కార్యవర్గము ఆర్డీవో కార్యాలయంలో డి టి పవన్ కుమార్ కు వినతి పత్రాన్ని సమర్పించారు.
ఈ సందర్భంగా మండల బిజెపి నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ నిర్మాణాలను చేపట్టిన కార్మికులకు జారీ చేస్తున్న వివిధ ప్రక్రియలను సరళీకృతం చేయాలని సంబంధిత శాఖల మధ్య సమన్వయం మెరుగుపరచడం ద్వారా నిజమైన లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.
ప్రతి నిర్మాణ కార్మికులు తమ కష్టముతో రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్న కార్మికుడు తన హక్కుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి రావడం చాలా బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో టెక్కలి మండల అధ్యక్షులు మరియు కోటబొమ్మాలి మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ జర్జాన రాంజీ యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు భూరి నరేంద్ర జిల్లా ఉపాధ్యక్షులు నడు పూరు లక్ష్మీనారాయణ స్టేట్ కౌన్సిలర్ నెంబర్ జన్ని పరమేశ్వరరావు ఉపాధ్యక్షులు ఆకుల ప్రకాష్ ఒడిసి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

# హమాలీలకు ఖాకీ యూనిఫాంల పంపిణీ




**నవతరం-శ్రీకాకుళం**

పౌరసరఫరాల సంస్థకు చెందిన మండల స్థాయి గోడౌన్లలో పని చేస్తున్న హమాలీలకు సోమవారం శ్రీకాకుళంలో ఖాకీ యూనిఫాంలను పంపిణీ చేశారు. జాయింట్ కలెక్టర్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ముఖ్య అతిథిగా హాజరై తన చేతుల మీదుగా హమాలీలకు ఈ దుస్తులను అందజేశారు. హమాలీల సంక్షేమానికి, వారి గుర్తింపునకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల మేనేజరు టి. వేణుగోపాల్, ఉప తహసీల్దారు మురళీధర్ నాయక్ లతో పాటు సిబ్బంది బి.వి.వి.ఎన్. రాజు, వండన చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# పలాసకు అభివృద్ధి ఊపు

- శిరీష కృషితో నిధుల వెల్లువ
- ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌కు 383 కోట్లు మంజూరు
- తాగునీరు, సాగునీటికి ప్రత్యేక కేటాయింపులు
- రైతులు, ప్రజల్లో హర్షాతిరేకం

**నవతరం-పలాస**

నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే గౌతు శిరీష కృషి ఫలితంగా పలాసలో అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పిరికట్ల విఠల్ రావు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా ఆమె నిరంతరం కృషి చేస్తున్నారని ఆయన కొనియాడారు.
రైతాంగం, ప్రజల చిరకాల స్వప్నమైన సాగు, తాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేస్తోందన్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిలిచిపోయిన ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులకు మళ్లీ ఊపిరి పోసేందుకు రూ.383 కోట్లను కేటాయించడం కీలక పరిణామమని తెలిపారు.
ఎమ్మెల్యే శిరీష గత 22 నెలలుగా ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఇప్పటికే రూ.120 కోట్లను మంజూరు చేయించారని పేర్కొన్నారు. గతంలో మంత్రి గౌతు శ్యామ్ సుందర్ శివాజీ హయాంలో రూ.465 కోట్లతో పనులు పురోగమించాయని గుర్తుచేశారు. పలాస మున్సిపాలిటీకి తాగునీటి సరఫరా కోసం ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నుంచి నీటిని అందించే పథకానికి రూ.122 కోట్లు మంజూరు కాగా, వంశధార, మైనర్ ఇరిగేషన్ పనులకు రూ.2 కోట్లు కేటాయించినట్లు వివరించారు.



ఎమ్మెల్యే శిరీష కృషితో పలాస రూపురేఖలు మారబోతున్నాయని, నియోజకవర్గ ప్రజల తరపున ఆమెకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని విఠల్ రావు పేర్కొన్నారు.

# 68 కేంద్రాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

- డీఎస్డీఓ ఇన్-ఛార్జ్ మాధురి లత
- కోడి రామమూర్తి స్టేడియంలో వేసవి శిబిరాలు ప్రారంభం

**నవతరం-శ్రీకాకుళం**




జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు మొత్తం 68 కేంద్రాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నామని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి, ఇన్-ఛార్జ్ ఎం. మాధురిలత తెలిపారు. సోమవారం స్థానిక కోడి రామమూర్తి స్టేడియంలో ఈ శిక్షణ శిబిరాలను ఆమె ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు వేసవి సెలవుల్లో సెల్ ఫోన్లకు పరిమితం కాకుండా, క్రీడల్లో శిక్షణ పొంది శారీరక ధారుఢ్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరాల్లో నిష్ణాతులైన శిక్షకుల ద్వారా మెళకువలు నేర్పించనున్నట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ బి.వి. రమణ, సెట్ శ్రీ సీఈఓ వి. వెంకట అప్పలనాయుడు పాల్గొని క్రీడాకారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు పి. సుందర్ రావు, శాప్ కోచ్‌లు క్రీడాకారులకు ప్రాథమికాంశాలపై అవగాహన కల్పించారు. ఈ శిబిరాలు మే 31 వరకు కొనసాగుతాయని, క్రీడల పట్ల ఆసక్తి ఉన్న 8 నుండి 16 ఏళ్ల లోపు బాలబాలికలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

# మంత్రి దంపతులకు సత్కారం

- టీడీపీ పదవిపై నేతలకు వెంకటేష్ కృతజ్ఞతలు
- రామ్మోహన్ నాయుడిని మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా అభినందనలు
- వివాహ వార్షికోత్సవం సందర్భంగా అరసవెల్లి దర్శనానికి మంత్రి దంపతులు
- పుష్పగుచ్ఛం, శాలువాతో ఘన సత్కారం





**నవతరం-శ్రీకాకుళం**

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఇప్పటికే బాధ్యతలు నిర్వహిస్తున్న మాదారపు వెంకటేష్ తనకు ఈ పదవి కల్పించిన పార్టీ అగ్రనేతలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్, నందమూరి బాలకృష్ణ, రాష్ట్ర, కేంద్ర మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ తదితరులకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడిని శ్రీకాకుళంలోని ప్రజాసదన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి కొనసాగిస్తానని వెంకటేష్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, శ్రీమతి విజయమాధవి దంపతులు తమ వివాహ వార్షికోత్సవం సందర్భంగా అరసవెల్లి శ్రీ సూర్యనారాయణ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. మంత్రి దంపతులకు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాదారపు వెంకటేష్ పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సత్కరించి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. మాదారపు వెంకటేష్ శ్రీకాకుళం జిల్లా నందమూరి బాలకృష్ణ మోక్షజ్ఞ ఫ్యాన్స్ అధ్యక్షుడిగా, జిల్లా ఎన్టీఆర్ మోక్షజ్ఞ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

# గ్రీవెన్స్ అర్జీదారులకు ఆయుష్ వైద్య సేవలు

**నవతరం-శ్రీకాకుళం :** జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ఉచిత ఆయుష్ వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రారంభించారు. జిల్లా గ్రీవెన్స్ ( పి జి ఆర్ ఎస్) కార్యక్రమానికి తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అర్జీదారులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన వినతిదారులు తమ అర్జీలను సమర్పించిన అనంతరం, అక్కడే అందుబాటులో ఉన్న ఆయుష్ వైద్య సేవలను వినియోగించుకున్నారు. సుమారు 60 మందికి పైగా అర్జీదారులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ఉత్తమ్ రాజ్, ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ సీతామాలక్ష్మి, కాంపౌండర్ జాడ చంద్రశేఖర్, రోణంకి కృష్ణారావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.




Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**